PRGI NO TGTEL/26/A2948

జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

జ్యోతి
శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 6 ॥ శుక్రవారం ॥ 5-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



# ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎం రేవంత్ పర్యటన

మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పనుల పరిశీలన

పంప్ హౌస్ కాంక్రీట్ పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశం

గుడ్డెందొడ్డి జలాశయం సామర్థ్యం పెంపుపై ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి

నేడు జడ్చర్లలో బహిరంగ సభకు హాజరుకానున్న సీఎం రేవంత్

"నిర్మాణాల్లో వేగమే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతం చేసేం దుకు ఆయన క్షేత్రస్థాయిలో విస్తృత పర్యట నలు చేస్తున్నారు."

గద్వాల, జూన్ 04: మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతలతో పాటు జవహర్ నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని గుడ్డెందొడ్డి పంపు హౌస్ పనులను ఆయన స్వయంగా పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. నారాయణపేట జిల్లా మక్తల్ చేరుకున్న ముఖ్యమంత్రి కాట్రేవులపల్లి పరిధిలో కొనసాగుతున్న ఎత్తిపోతల తరువాయి 2 వ పేజీలో...





# కొత్త విమానయాన పాలసీ

## అమరావతి ఐ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం

రాష్ట్రానికి పర్యాటకాన్ని పెంచేలా బీచ్ షాక్‌ల ఏర్పాటు

అగ్రిగోల్డ్ పరిష్కారానికి ప్రత్యేక కోర్టుకు సిబ్బంది నియామకం, సబ్ కమిటీ ఏర్పాటు

లండన్ ఐ, దుబాయ్ ఐ తరహాలో రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి పర్యాటక ఆకర్షణగా 'అమరావతి ఐ' నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కృష్ణా నది ఒడ్డున 6 ఎకరాల విస్తీర్ణంలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీనికోసం త్వరలోనే టెండర్లు ఆహ్వానించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటకులు అమరావతి, కృష్ణా నది అందాలను వీక్షించేందుకు వీలవుతుందని, ఇది ప్రపంచ పర్యాటక పటంలో ఏపీకి ప్రత్యేక గుర్తింపు తెస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

అమరావతి, జూన్ 04: అమరావతిలో మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేసేలా కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు భవన బాహ్య సుందరీకరణ పనుల కోసం రూ. 547 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అలాగే ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాసాల్లో ఆధునిక వసతులు, హోమ్ ఆటోమేషన్ కోసం రూ. 94.90 కోట్లు కేటాయించింది. రాజధానిలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి 8 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణాన్ని రాబోయే 9-10 నెలల్లో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వీబీజీ రామ్ జీ పథ కాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 1, 2026 నుంచి అమల్లోకి రానున్న ఈ పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 100 రోజుల ఉపాధి తరువాయి 2 వ పేజీలో...

## 9 నుంచి ప్రజల్లోకి కూటమి నేతలు

రెండేళ్ల విజయాలపై ఎన్డీయే కూటమి కార్యక్రమాలు

తిరుపతి, అమరావతి, విశాఖల్లో భారీ బహిరంగ సభలు

మేమంతా ఒక్కటే.. విచ్ఛిన్నం చేయాలని చూస్తే సాగదు: నేతల స్పష్టీకరణ





ఆంధ్రప్రదేశ్‌లో అధికార ఎన్డీయే కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఉమ్మడి కార్యాచరణ సిద్ధమైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం రాత్రి జరిగిన కూటమి పక్షాల సుదీర్ఘ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

అమరావతి, జూన్ 04: అనంత రం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ -2 వ పేజీలో...




## హోరెత్తిన వైఎస్సార్‌సీపీ నిరసనలు!

హామీల అమలులో టీడీపీ విఫలమైందని ఆరోపణలు

చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పేరిట నిరసనలు

అమరావతి, జూన్ 04: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమబాట పట్టింది. చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పేరిట రాష్ట్రవ్యాప్తంగా భారీ నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండల కేంద్రాల్లో టీడీపీ మేనిఫెస్టో ప్రతులను, చంద్రబాబు-పవన్ కల్యాణ్‌ల సంతకాలతో కూడిన బాండ్లను పార్టీ శ్రేణులు దహనం చేశాయి. ఈ నిరసనల పరంపరలో భాగంగా ఈ నెల 8 లేదా 9 తేదీల్లో టౌన్ హాల్ సదస్సులు, అలాగే ఈ నెల 12న నియోజకవర్గ కేంద్రాల్లో భారీ నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. గుజ్జనగుండ్ల సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమంతో గుంటూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీడీపీ శ్రేణులు కూడా జగన్‌కు వ్యతిరేకంగా ఆందోళనకుతరువాయి 2 వ పేజీలో...



## ఎన్డీయే కూటమిలో రాజ్యసభ సీట్ల సర్దుబాటు..

అమరావతి, జూన్ 04: ఆంధ్రప్రదేశ్‌లో త్వ రలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల కేటాయింపుపై అధికార ఎన్డీయే కూటమి నేత ల మధ్య ఒక స్పష్టమైన అవగాహన కుదిరిం ది. అసెంబ్లీలో కూటమికి ఉన్న భారీ మెజారి టీ దృష్ట్యా ఈ నాలుగు స్థానాలూ ఏకగ్రీవం కానున్న నేపథ్యంలో.. తెదేపాకు 3, జనసేనకు ఒక స్థానాన్ని కేటాయించాలని నేతలు నిర్ణ యించారు. క్యాంపు కార్యాలయంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం రాత్రి కీలక సమావేశం జరిగింది. తరువాయి 2 వ పేజీలో...

## దుష్ప్రచారాలతో అభివృద్ధిని అడ్డుకోలేరు

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



విజయవాడ, జూన్ 04: సోషల్ మీడియా వేదికగా తనపై, తన అ నుచరులపై మాజీ ఎంపీ కేశినేని నాని చేస్తున్న ఆరోపణ లు, పోస్టు లపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఘాటుగా స్పం దించారు. సమాజంలో కొందరు వ్యక్తులు వాస్తవాలకు దూరంగా ఉండి, ఒక అబద్ధాన్ని పదేపదే ప్రచా రం చేస్తూ పుకార్లు సృష్టించడానికే తమ సమయాన్ని, శక్తిని వెచ్చిస్తు న్నారని మండిపడ్డారు. ప్రజాస్వా మ్యంలో విమర్శలు సహజమే అయినప్పటికీ, -2 వ పేజీలో...




## హైదరాబాద్‌కు ఎబోలా

సూడాన్ నుంచి వచ్చిన వ్యక్తికి లక్షణాలు.. గాంధీ ఆస్పత్రికి తరలింపు

హైదరాబాద్‌లో ఎబోలా కలకలం రేగింది. శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడికి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సూడాన్ దేశం నుంచి మహ్మద్ అనే వ్యక్తి గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్టు చేరుకున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు విమానాశ్రయంలో అధికారులు ఆఫ్రికా దేశాల నుంచి వచ్చేవారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్, జూన్ 4: ఈ క్రమంలోనే సూడాన్ నుంచి వచ్చిన మహ్మద్‌కు పరీక్షలు నిర్వహించగా.. ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్లు గుర్తిం చారు. వెంటనే అప్రమత్తమైన వైద్య సిబ్బంది.. అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసోలేషన్ కేంద్రంలో ఉంచి పరీక్షిస్తున్నారు. అతని నుంచి నమూనాలను సేకరించిన గాంధీ ఆస్పత్రి సిబ్బంది.. పరీక్షల్లో కోసం ఆ శాంపిళ్లను సీసీఎంబీకి పంపించారు. ఫలితాలు వచ్చేంత వరకూ ఈ విషయంపై ఆస్పత్రి వర్గాలలో టెన్షన్ నెలకొంది. మరోవైపు ఆఫ్రికా దేశాలైన కాంగో, ఉగాండాలలో ఎబోలా వ్యాప్తి -2 వ పేజీలో...

# నేటి రాశి ఫలాలు

మేషం : మీ కృషికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. శ్రమకు తగ్గ పురోగతి సాధించే అవకాశం ఉంది. వ్యాపార రంగంలో కొత్త అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగంలో చురుకుదనం ప్రదర్శిస్తే ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. సూర్యధ్యానం విజయాన్నిస్తుంది.

వృషభం : కృషికి తగిన ఫలితం వస్తుంది. బంధుమిత్రుల సహకారం మీలో ఉత్సాహాన్ని పెంచుతుంది. పాత విభేదాలు తొలగి బంధాలు మెరుగుపడతాయి. విలువైన వస్తువుల కొనుగోలు ఆనందాన్ని కలిగిస్తుంది. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం నూతన ఉత్సాహాన్ని కలిగిస్తుంది.

మిథునం : ఆత్మవిశ్వాసమే మీ విజయానికి ప్రధాన ఆధారం అవుతుంది. ఆటంకాలను సమర్థంగా అధిగమిస్తారు. సమాజంలో గౌరవం, గుర్తింపు పెరుగుతాయి. బంధుమిత్రులతో కలిసి చేపట్టిన పనులు సానుకూల ఫలితాలనిస్తాయి. ఇష్టదేవతా స్తోత్ర పారాయణం ఆత్మబలాన్ని పెంచుతుంది.

కర్కాటకం : సహచరుల సహకారంతో పనులు విజయవంతమవుతాయి. స్థిరమైన నిర్ణయాలు మంచి ఫలితాలను అందిస్తాయి. చిన్న చిన్న విభేదాలను పట్టించుకోకుండా ముందుకు సాగాలి. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. శివనామ స్మరణ మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

సింహం : ఆటంకాలు ఎదురైనా మనోధైర్యం కోల్పోవద్దు. సహనం, పట్టుదల మీకు విజయాన్ని అందిస్తాయి. ఆరోగ్య సంరక్షణపై దృష్టిపెడితే మంచిది. ఆలోచించి తీసుకునే నిర్ణయాలు మేలు చేస్తాయి. నవగ్రహ శ్లోక పఠనం ప్రతికూలతలను తగ్గిస్తుంది.

కన్య : కొన్ని సవాళ్లు ఎదురైనా పట్టుదలతో విజయాన్ని సాధిస్తారు. కుటుంబ సభ్యుల సలహాలు మార్గదర్శకంగా నిలుస్తాయి. శారీరక శ్రమ పెరిగినా ఫలితం సంతృప్తికరంగా ఉంటుంది. దుర్గా శ్లోక పఠనం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

తుల : మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయి. ధైర్యంగా ముందడుగు వేస్తే విజయాలు మీవే అవుతాయి. గోవింద నామస్మరణ మనోధైర్యాన్ని, ఉత్సాహాన్ని పెంచుతుంది.

వృశ్చికం : భవిష్యత్తుకు అనుకూలమైన పరిణామాలు కనిపిస్తున్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో శుభఫలితాలు సాధిస్తారు. ఒక శుభవార్త మీలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. సూర్యారాధన విజయమార్గాన్ని చూపుతుంది.

ధనుస్సు : మీ ప్రయత్నాలకు తగిన ఫలితాలు లభిస్తాయి. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మిత్రుల సహకారం మేలు చేస్తుంది. మానసిక దృఢత్వం మీకు నూతన అవకాశాలను అందిస్తుంది. శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. సూర్యశ్లోక పఠనం శుభప్రదం.

మకరం : మంచి ఫలితాలు మీకు అనుకూలంగా ఉన్నాయి. శుభ కార్యక్రమాల్లో పాల్గొని ఆనందాన్ని పంచుకుంటారు. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆత్మీయులతో గడిపే సమయం సంతోషాన్నిస్తుంది. ఇష్టదైవ దర్శనం ఆత్మసంతృప్తిని కలిగిస్తుంది.

కుంభం : శారీరక శ్రమ అధికంగా ఉన్నప్పటికీ ఫలితం ఆనందాన్నిస్తుంది. బంధువులతో మితంగా, మృదువుగా వ్యవహరించడం మంచిది. ఖర్చులపై నియంత్రణ పాటిస్తే ఆర్థికంగా మేలు జరుగుతుంది. శని ధ్యానం స్థిరబుద్ధిని, సహనాన్ని ప్రసాదిస్తుంది.

మీనం : మీ ఓర్పు, సహనం విజయానికి పునాది అవుతాయి. కొన్ని పనులు ఆలస్యమైనా అనుకూల ఫలితాలు తప్పక లభిస్తాయి. భయాందోళనలను దూరంగా ఉండాలి. ధైర్యంగా ముందుకు సాగాలి. ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తే పరిస్థితులు అనుకూలిస్తాయి. నవగ్రహ ధ్యాన శ్లోక పఠనం ధైర్యాన్ని, మనోబలాన్ని పెంచుతుంది.





# ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎం రేవంత్ పర్యటన

మొదటి పేజీ తరువాయి

పథకం పనులను పరిశీలించారు. ప్యాకేజీ వన్ సైట్ వద్ద పంప్ హౌస్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆగిన కాంక్రీటు పనులను తక్షణమే ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ చూసి ప్లాన్ మ్యాప్స్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని గుడ్డెందొడ్డి పంపు హౌస్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి అధికారులతో ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. జలాశయం సామర్థ్యాన్ని పదిహేను టీఎంసీలకు పెంచాలని స్థానిక ప్రజా ప్రతినిధులు కోరారు. ర్యాలంపాడు సీపేజీ సమస్యను పరిష్కరించి నాలుగు టీఎంసీల నీటిని నిల్వ చేసేలా చర్యలు చేపట్టాలని మల్లమ్మ కుంట భూసేకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

ఉమ్మడి జిల్లా పరిధిలోని రిజర్వాయర్లు కాలువల పనులను పరిశీలించిన ముఖ్య మంత్రి పర్యటన నేడు కూడా కొనసాగ నుంది. సాయంత్రం జడ్చర్లలో జరిగే భా రీ బహిరంగ సభతో ఈ పర్యటన ముగు స్తుంది. ముఖ్యమంత్రి వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి దామోదర రాజనర్సింహ జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరి కర్ణాటక మంత్రి బోసురాజు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు ఉన్నారు.



## దుష్ప్రచారాలతో అభివృద్ధిని అడ్డుకోలేరు

మొదటి పేజీ తరువాయి

ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు రాజకీయ సంస్కృతికి మంచివి కావని హితవు పలికారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, నిజానిజాలను గుర్తించే పరిణతి వారికి ఉందని పేర్కొన్న ఆయన.. తనపై జరుగుతున్న అసత్య ప్రచారాలకు మాటలతో కాకుండా చేతలతో, తను చేసే పనులతోనే సమాధానం చెబుతానని స్పష్టం చేశారు.

తన జీవితాన్ని వివాదాల్లో గడపడం కంటే నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టడం, విజయవాడను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని ఎంపీ చిన్ని స్పష్టీకరించారు. సోషల్ మీడియాలో జరిగే ప్రతికూల ప్రచారాల వల్ల నియోజకవర్గ ప్రగతి ఆగిపోదని, ప్రజాసేవకు ఎలాంటి ఆటంకం కలగదని భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ విజయవాడ పార్లమెంట్ పరిధిలో మౌలిక వసతుల మెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన వంటి అంశాలపై నిరంతరం దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని విమర్శలు చేసినా ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా ముందుకు సాగుతామని, అభివృద్ధి, ఫలితాల సాధనే తన రాజకీయ తత్వమని ఆయన పునరుద్ఘాటించారు.

## ఎన్డీయే కూటమిలో రాజ్యసభ సీట్ల సర్దుబాటు..

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి నాదెండ్ల మనోహర్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. రెండు గంటలకు పైగా సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలు, ఎస్ఐఆర్ అంశాలతో పాటు ప్రధానంగా రాజ్యసభ స్థానాల సర్దుబాటుపై విస్తృతంగా చర్చించారు. ఈ చర్చల అనంతరం సీట్ల పంపకంపై ఒక నిర్ణయానికి వచ్చారు. రాజ్యసభ బరిలో నిలిచే అభ్యర్థుల పేర్లను తెదేపా, జనసేన పార్టీలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ తరపున రాజ్యసభకు ఎన్నికైన పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీలతో పాటు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ తరపున రాజ్యసభకు వెళ్లిన సానా సతీష్‌ల పదవీ కాలం త్వరలోనే ముగియనుంది. ప్రస్తుత శాసనసభ స్థానాల బలాబలాల ప్రకారం ఈ నాలుగు స్థానాలూ కూటమి ఖాతాలోనే పడనున్నాయి. దీంతో పొత్తు ధర్మాన్ని పాటిస్తూ టీడీపీ, జనసేన పార్టీలు ఈ స్థానాలను పంచుకున్నాయి. గతంలో వైసీపీ తరపున రాజ్యసభ సభ్యులుగా ఉన్న ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ పదవులకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఖాళీ అయిన ఆ నాలుగు స్థానాల్లో.. మిత్రధర్మంలో భాగంగా రెండు స్థానాలను బీజేపీకి కేటాయించగా, మిగిలిన రెండు స్థానాలను టీడీపీ తీసుకుంది.

ఆ సమీకరణాల ప్రకారం.. ఆర్.కృష్ణయ్య రాజీనామా చేసిన స్థానం నుండి బీజేపీ తరపున ఆయనే మళ్లీ రాజ్యసభకు వెళ్లారు. విజయసాయిరెడ్డి ఖాళీ చేసిన స్థానంలో బీజేపీ నాయకుడు పాకా సత్యనారాయణ ఎంపికయ్యారు. అలాగే, వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన బీద మస్తాన్‌రావుకు ఆ స్థానాన్ని మళ్లీ టీడీపీ కేటాయించింది. ఇక మోపిదేవి వెంకటరమణ రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో టీడీపీ తరపున సానా సతీష్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇప్పుడు సానా సతీష్ పదవీ కాలం కూడా ముగుస్తుండటంతో, తాజాగా ఖాళీ అయ్యే 4 స్థానాలను తెదేపా, జనసేనలు పంచుకున్నాయి.

## హైదరాబాద్‌కు ఎబోలా

మొదటి పేజీ తరువాయి

ఎక్కువగా ఉంది. ముఖ్యంగా బుండిబుగ్యో అనే వేరియంట్ కారణంగా ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అప్రమత్తమై.. ఇంటర్నేషనల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆఫ్రికా దేశాలలో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్రం కూడా అప్రమత్తమై పలు సూచనలు చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినవారు.. అలాగే ఆ దేశాల మీదుగా భారతదేశంలోకి వచ్చిన ప్రయాణికులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సూచించింది. ఇప్పటి వరకూ మనదేశంలో ఎబోలా కేసులు నమోదు కాలేదని క్లారిటీ ఇచ్చింది. అయితే ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. గత 21 రోజులలో ఎవరైనా ఎబోలా ప్రభావిత దేశానికి వెళ్లి వచ్చి ఉంటే సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లాలని సూచించింది. అలాగే ఎబోలా ప్రభావిత దేశాల మీదుగా వచ్చినా కూడా ఈ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేసింది. తలనొప్పి, కండరాల నొప్పి, జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లాలని సూచించింది. అలాగే దగ్గరలోని ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించాలని సూచించింది.

# 9 నుంచి ప్రజల్లోకి కూటమి నేతలు

మొదటి పేజీ తరువాయి

సంయుక్తంగా మీడి యాతో మాట్లాడారు. రాష్ట్రంలో త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల్లో టీడీపీ 3, జన సేన 1 స్థానాన్ని తీసుకోవాలని ఈ సమావేశంలో తుది నిర్ణయం తీసు కున్నట్లు వారు ప్రకటించారు. సమావేశ వివరాలను టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్ల పాలనా విజయాలపై ఉమ్మడి కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మూడు ప్రాంతాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

జూన్ 9: తిరుపతిలో 'సంక్షేమం' అజెండాగా తొలి సభ.

జూన్ 12: అమరావతిలో 'సుపరిపాలన' అంశంపై రెండో సభ.

జూన్ 15: విశాఖపట్నంలో 'అభివృద్ధి' ప్రధానాంశంగా మూడో సభ.

ఈ సభలతో పాటు జూన్ 13, 16, 17, 18, 19, 20 తేదీల్లో అన్ని జిల్లాల్లోనూ రెండేళ్ల పాలనపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని, దీనికి సంబంధించిన పూర్తి క్యాంపెయిన్ షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అలాగే ఈ భేటీలో ఎస్ఐఆర్ అంశంపై కూడా చర్చించినట్లు తెలిపారు.

గడిచిన 24 నెలల కూటమి పాలనలో అమలు చేసిన 24 ప్రధాన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, పథకాలను ఈ ప్రచారం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు సంయుక్తంగా నిర్వహించే ఈ బహిరంగ సభల్లో కేంద్ర మంత్రులు కూడా పాల్గొంటారని స్పష్టం చేశారు. ఈ ఉమ్మడి కార్యాచరణ ద్వారా ప్రజల ఆశీస్సులను మరోసారి కోరతామని చెప్పారు. కాగా, జనసేనకు కేటాయించిన ఒక రాజ్యసభ స్థానానికి అభ్యర్థి ఎవరనేది తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ త్వరలోనే ప్రకటిస్తారని మనోహర్ వెల్లడించారు.

కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 12 ఏళ్ల పాలన, రాష్ట్రంలో కూటమి రెండేళ్ల పాలన వల్ల ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రధాని మోదీ ప్రమాణస్వీకారం చేసిన రోజైన జూన్ 9 నుంచే ఈ విజయోత్సవ కార్యాచరణను ప్రారంభించాలని సీఎం చంద్రబాబు సూచించారన్నారు. రాష్ట్రానికి దక్కిన భారీ పరిశ్రమలు, పోలవరం, అమరావతి నిర్మాణాలు, విశాఖ రైల్వే జోన్ సాధన వంటి అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్తామన్నారు. రాజ్యసభ సీట్ల సర్దుబాటుపై స్పందిస్తూ.. టీడీపీ, జనసేనకు రాజ్యసభ సీట్లు ఉంటే అది భాజపాకి ఉన్నట్టే అని మిత్రధర్మాన్ని చాటారు. కూటమి ఐక్యతను కొందరు స్వయం ప్రకటిత మేధావులు కంటగింపుగా చూస్తూ రకరకాల విశ్లేషణలు చేస్తున్నారని, కానీ తామంతా ఎప్పటికీ ఒక్కటిగానే ఉంటామని మాధవ్ స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న తెలంగాణ కాంగ్రెస్ నేతల వైఖరి సరైంది కాదని ఆయన హితవు పలికారు.

# శ్వేత సంపాదకీయం

గురువారం 4-6-2026

# తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయం !

తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని..నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఎపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడిక్కడ భూములు దోచుకున్నారు. అప్పుల చేసి దోచుకున్నారు. తెలంగాణను అప్పసుల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్దరించామని చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా ఆస్తులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్దరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ధి చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మీ అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక...ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నావంటూ పవన్‌ను చీల్చి చెండాడేంత పని చేశారు. పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు.

రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే. రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్లు దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ధి పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల్లా తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యధేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బాగుపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారుసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోడీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ పాగా వేయాలని ఎప్పటనుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టారా అన్నది కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్ ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రాతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు.

కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పకుంటూ పోతే కథలు కోకొల్లలు. ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి. ఈ గడ్డపై నివస్తిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్లా తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కాదు. తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయలు చేసుకునే హక్కు ఉంటుంది. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని తప్పుపట్టడానికి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చలాయించిన సమైక్య పాలకులు, తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేపట్టిన వారు కూడా తెలంగాణను నిలువునా దోచుకున్నారు. కాబట్టి ఎవ్వరు కూడా తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడలేదు. తమ స్వార్థ రాజకీయం కోసమే పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇదే సెంటిమెంటుతో తమ ఉనికి కోసం కొందరు ఇప్పుడు నానా యాగీ చేస్తున్నారని గుర్తిస్తే మంచిది.



# కొత్త విమానయాన పాలసీ

మొదటి పేజీ తరువాయి

హామీని 125 రోజులకు పెంచారు. దీనివల్ల ప్రతి గ్రామీణ కుటుంబానికి అదనంగా ఏటా రూ. 7,675 లబ్ధి చేకూరుతుంది. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. కూలీలకు 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని, ఆలస్యమైతే రోజుకు 0.05% చొప్పున వడ్డీ చెల్లించాలని నిబంధన విధించడం విశేషం.

**విమానయానం, పర్యాటక రంగాలకు కొత్త పాలసీలు**

రాష్ట్ర విమానయాన రంగంలో భారీ లక్ష్యాలతో కూడిన కొత్త పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2035 నాటికి ప్యాసింజర్ మార్కెట్ షేర్‌ను 4 శాతానికి, ఎయిర్ కార్గో మార్కెట్ షేర్‌ను 5 శాతానికి పెంచాలని, కొత్త విమానాశ్రయాలు, వాటర్ డ్రోమ్‌ల ఏర్పాటును ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే గోవా, ఒరిస్సా తరహాలో రాష్ట్రంలో పర్యాటకాన్ని పెంచేందుకు 'బీచ్ షాక్ పాలసీ' కి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పైలట్ ప్రాజెక్ట్‌గా తొలి దశలో చీరాలలోని సూర్యలంక బీచ్, విశాఖపట్నం బీచ్‌లలో రెండేసి చొప్పున షాక్‌లను ఏర్పాటు చేయనున్నారు.

**అవయవ మార్పిడి నియంత్రణ చట్టం అమలు**

అవయవదానం, అవయవ మార్పిడి ప్రక్రియలను క్రమబద్ధీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 'ది ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్-2011' ను రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, అవయవాల అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టేందుకు ఈ చట్టాన్ని ఆర్డినెన్స్ రూపంలో తీసుకురానున్నారు.

**పోలవరం నిధుల సవరణ.. అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట**

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ 5, 5ఎ పనుల అంచనా వ్యయాన్ని రూ. 352.6 కోట్ల నుంచి రూ. 796.66 కోట్లకు సవరిస్తూ కేబినెట్ పరిపాలన అనుమతులు ఇచ్చింది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టుకు 21 పోస్టులను మంజూరు చేసింది. ఈ కేసుల పర్యవేక్షణ కోసం మంత్రులతో కూడిన ఒక సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం నెడ్‌క్యాప్ ద్వారా పలు కంపెనీలకు భూములు లీజుకు ఇచ్చే ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

**కేబినెట్ నిర్ణయాలు**

లి తిరుపతి జిల్లా శ్రీ సిటీలో అంతర్జాతీయ స్థాయి ప్రైవేట్ యూనివర్సిటీ ఏర్పాటుకు వీలుగా ఏపీ ప్రైవేట్ యూనివర్సిటీ యాక్ట్-2016 సవరణకు ఆర్డినెన్స్ జారీ.

జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రూ. 10 కోట్లు మంజూరు.

లి గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులోని 25 ఎకరాల ట్యాంక్ పోరంబోకు'భూమిని గ్రామ కంఠంగా మారుస్తూ నిర్ణయం. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూసమస్యలన్నింటినీ పరిష్కరించాలని సీఎం ఆదేశం.

లి అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల నిర్మాణానికి 66 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపు.

మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం రాజధాని అమరావతి నిర్మాణానికి పూర్వవైభవం తేవడం, పర్యాటక రంగంలో వినూత్న మార్పులు చేపట్టడం, గ్రామీణ పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ధ్యేయంగా సాగింది. ఈ నిర్ణయాలు రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రగతిపై అత్యంత సానుకూల ప్రభావాన్ని చూపుతాయని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.



# ప్రజల ఆశీర్వాదాలతో కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తి

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

విజయవాడ, జూన్ 04: విధ్వంసకర పాలనకు చరమగీతం పాడుతూ రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుందని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం సింగ్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల హామీల అమలులో భాగంగా సామాజిక భద్రతా పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 'తల్లికి వందనం', ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం వంటి ఎన్నో కీలక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు ఫలాలు అందిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, కూటమి నాయకులకు, రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.గత రెండేళ్లలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, విద్యా, వైద్య రంగాల పురోభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని ఎమ్మెల్యే బొండా ఉమా స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పారదర్శకంగా ఆర్థిక సాయం అందిస్తూ, ప్రతి శుక్రవారం నిర్వహించే 'ప్రజా దర్బార్' ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ పట్టాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, జీఓ నెం.306 మరియు జీఓ నెం.30 ద్వారా సుబ్బరాజు నగర్, అరుణోదయ నగర్, గిరిపురం, అంబేద్కర్ కాలనీ, నేతాజీ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలకు శాశ్వత భూ హక్కులు కల్పించే దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని వెల్లడించారు. పదవి అనేది అధికారం కోసం కాదని, ప్రజలకు సేవ చేయడానికి లభించిన అవకాశమని పేర్కొన్న ఆయన, ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు తమ ప్రయాణం ఆగదని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో టీడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్ పాల్గొన్నారు.



# ప్రకాశ్ రాజ్ వర్సెస్ బండ్ల గణేష్..!

## టాలీవుడ్‌లో ముదిరిన మాటల యుద్ధం

## సినీ, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా సోషల్ మీడియా వార్

హైదరాబాద్, జూన్ 04: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రకటనపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు దానికి టాలీవుడ్ నిర్మాత బండ్ల గణేశ్ ఇచ్చిన కౌంటర్లతో సినీ రాజకీయ వర్గాల్లో మాటల యుద్ధం ముదిరింది. రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ జనసేన పార్టీ పోటీ చేస్తుందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ వివాదం చెలరేగింది. దీనిపై ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ రండి దొర మీరొస్తానంటే మేమొద్దంటామా కానీ వచ్చే ముందు పొత్తుతో వస్తున్నారా లేదా సింగిల్ గా వస్తున్నారా అది చెప్పి రండి అంటూ పరోక్షంగా ఘాటు పోస్ట్ పెట్టారు.

**ఎక్స్ లో విరుచుకుపడ్డ బండ్ల గణేశ్**

ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలపై సినీ నిర్మాత బండ్ల గణేశ్ ఎక్స్ వేదికగా అత్యంత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నీకెందుకురా ప్రతి దాంట్లో వేలుపెట్టడం అసలు నువ్వెవడివి తమిళోడివా తెలుగోడివా కన్నడోడివా అంటూ ప్రశ్నించారు. ప్రతి ఊర్లో ప్రతి ఇష్యూలో దూరి జడ్జిమెంట్‌లు ఇవ్వడానికి నువ్వేమైనా కలెక్టర్‌వా లేక దేశ ప్రధానివా అంటూ నిలదీశారు. నీకు పని లేకపోతే చూసుకో కానీ అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వద్దని ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకొని తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**నెట్టింట జనసైనికుల కౌంటర్లు**

తెలంగాణ రాజకీయాల్లోకి జనసేన ఎంట్రీ ఇస్తుందనే ప్రకటనపై ప్రకాశ్ రాజ్ చేసిన ట్వీట్ ప్రస్తుతం నెట్టింట తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై జనసేన పార్టీ శ్రేణులు మరియు అభిమానులు సైతం సోషల్ మీడియాలో తీవ్రంగా స్పందిస్తున్నారు. గతంలో ప్రకాశ్ రాజ్ ఎన్నికల్లో ఎదుర్కొన్న ఓటములను ప్రస్తావిస్తూ నెటిజన్లు గట్టి కౌంటర్లు ఇస్తున్నారు. ఈ ఇద్దరు ప్రముఖుల మధ్య చోటుచేసుకున్న ఈ ట్విట్టర్ వార్ తెలుగు రాష్ట్రాల రాజకీయ మరియు సినీ వర్గాల్లో మరింత వేడిని రగిల్చింది.



# సింగరేణి కుంభకోణాల నుంచి దృష్టి మళ్లించేందుకే బాల్క సుమన్ అరెస్ట్

**అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడదని స్పష్టం**

**చంచల్ గూడ జైల్లో బాల్క సుమన్‌కు కేటీఆర్ పరామర్శ**

హైదరాబాద్, జూన్ 04: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, సింగరేణి సంస్థలో జరుగుతున్న వేల కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. చంచల్‌గూడ జైలులో ఉన్న బాల్క సుమన్‌ను గురువారం బీఆర్ఎస్ నేతలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డిలతో కలిసి కేటీఆర్ ములాకత్ అయ్యారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. గతంలో రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్నప్పుడు సీఎం అధికారిక నివాసం ప్రగతి భవన్‌ను బాంబులు పెట్టి పేల్చేసినా తప్పు లేదన్నప్పుడు ఆయన శిక్షార్హుడు కాదా? హైదరాబాద్ పాతబస్తీపై సర్జికల్ స్ట్రైక్ చేస్తామన్న ప్రస్తుత కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ఎందుకు చర్యలు లేవని ప్రశ్నించారు. సిద్దిపేటలో హరీశ్‌రావు క్యాంప్ ఆఫీస్‌ను తగలబెడతా అన్న కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావుపై, కంపెనీని తగలబెడతానన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై చట్టం ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) సమావేశంలో కార్మికుల పక్షాన నిలబడి గళమెత్తిన బాల్క సుమన్ మాటలను వక్రీకరించి, అక్రమంగా పీడీపీపీ యాక్ట్ కింద కేసులు పెడితే.. పోలీసుల అత్యుత్సాహాన్ని కోర్టు సైతం మందలించి ఆ సెక్షన్లను తొలగించిందని కేటీఆర్ గుర్తుచేశారు.

ప్రభుత్వ అక్రమాలకు, జైలు శిక్షలకు బీఆర్ఎస్ భయపడే ప్రసక్తే లేదని, సింగరేణి కార్మికుల పొట్టగొడుతున్న కాంగ్రెస్ సర్కార్‌ను గల్లా పట్టి నిలదీస్తామని కేటీఆర్ హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డి కనుసన్నల్లో సైట్ విజిటేషన్ సర్టిఫికేట్ పేరిట జరిగిన రూ.15,000 కోట్ల కుంభకోణాన్ని, సోలార్ టెండర్లలో జరిగిన వందల కోట్ల అక్రమాలను బీఆర్ఎస్ బహిర్గతం చేసిందన్నారు. నైనీ బొగ్గు టెండర్ వ్యవహారంలో మంత్రులకు, ముఖ్యమంత్రికి మధ్య వాటాలు కుదరక చివరకు ఆ టెండర్‌ను రద్దు చేయాల్సి వచ్చిందని వివరించారు. సింగరేణిలో మైనింగ్ చేయని బొగ్గును చేసినట్టుగా రికార్డులు సృష్టించి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును మాయం చేసి, రూ.1,600 కోట్ల మేర గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 19 వేల వారసత్వ ఉద్యోగాలు ఇస్తే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 11 నెలలుగా మెడికల్ ఇన్వాలిడేషన్ బోర్డు మీటింగులు పెట్టకుండా కార్మిక బిడ్డలకు అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. ఇంత పెద్ద కుంభకోణం జరుగుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీసిన కేటీఆర్.. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నిస్తూ, ఈ భారీ స్కామ్‌పై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి సమగ్రమైన లేఖ రాస్తానని వెల్లడించారు.

# బీజేపీ టచ్‌లో ఎంపీలు.. అసలు లెక్క ఎంత?

## 20 మంది ఎంపీలు బీజేపీకి టచ్‌లో ఉన్నట్లు ప్రచారం



కోల్ కతా, జూన్ 04: అసెంబ్లీ ఎన్నికల ఓటమి గాయం నుంచి తేరుకోకముందే పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి సొంత పార్టీ నేతలు మరో భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలో తొలిసారి ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నేతృత్వంలో ఏకంగా 58 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు జెండా ఎగరేసి, రితబ్రతను శాసనసభా పక్ష నేతగా ప్రకటించుకోగా... ఇప్పుడు దిల్లీ పార్లమెంట్ వేదికగా కూడా ఎంపీలు కూడా అదే బాటలో ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. పార్లమెంట్‌లో బీజేపీ, కాంగ్రెస్ తర్వాత 42 మంది సభ్యులతో (లోక్‌సభలో 29, రాజ్యసభలో 13) మూడో అతిపెద్ద శక్తిగా ఉన్న టీఎంసీలో ఇప్పుడు ఎంపీల ఫిరాయింపుల ముఠా యాక్టివ్ అయింది. లోక్‌సభలో మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పార్లమెంటరీ పార్టీ నేతగా వ్యవహరిస్తుండగా.. మెజార్టీ ఎంపీలు ఇప్పుడు అసమ్మతి వర్గం వైపు మొగ్గు చూపుతుండటం ఆయన నాయకత్వానికే పెద్ద సవాల్‌గా మారింది. ఒకవేళ ఇదే జరిగితే జాతీయ స్థాయిలో పార్టీ స్వరూపం మారడంతో పాటు, కేంద్రంలోని బీజేపీపై పోరాడే ఇండియా కూటమిలో తృణమూల్ గళం పూర్తిగా బలహీనపడనుంది.

పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం అనర్హత వేటు పడకుండా, ప్రత్యేక వర్గంగా గుర్తింపు పొందాలంటే మూడింట రెండు వంతుల (2/3) మెజారిటీ సభ్యుల మద్దతు తప్పనిసరి. గతంలో ఆప్ నుంచి రాఘవ్ చడ్డా సహా పలువురు రాజ్యసభ ఎంపీలు ఇదే లెక్కతో బీజేపీలో చేరగా.. ఇప్పుడు టీఎంసీ తిరుగుబాటు నేతలు సైతం అదే వ్యూహంతో అడుగులు వేస్తున్నారు. లోక్‌సభలోని 29 మంది టీఎంసీ ఎంపీల్లో 19 మంది, రాజ్యసభలోని 13 మందిలో 9 మంది చేతులు కలిపితే ఉప ఎన్నికల ముప్పు లేకుండా పార్టీ మారే అవకాశం ఉండటంతో, ఇప్పటికే 9 మంది లోక్‌సభ ఎంపీలు, ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఈ చర్చల్లో తీవ్ర ఆసక్తి కనబరిచినట్లు సమాచారం.

మునిగిపోతున్న నౌకలో ఒంటరిగా మిగలడానికి ఎవరూ ఇష్టపడరని, అందుకే కొందరు ఎంపీలు కాంగ్రెస్ వైపు కూడా చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లోక్‌సభలో 240 సీట్లతో మిత్రపక్షాల మద్దతుతో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం, ఈ ఫిరాయింపుల ద్వారా తమ సొంత సంఖ్యాబలాన్ని పెంచుకుని, మిత్రపక్షాలపై ఆధారపడే పరిస్థితిని తగ్గించుకోవాలని చూస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# భాగ్యనగరంలో ఎబోలా కలకలం

## సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడికి లక్షణాలు.. గాంధీ ఆస్పత్రిలో చికిత్స




హైదరాబాద్, జూన్ 04: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎబోలా వైరస్ కలకలం రేపింది. సూడాన్ దేశం నుండి విమానంలో ఇక్కడికి చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడిని విమానాశ్రయంలోని ప్రభుత్వ స్క్రీనింగ్ కేంద్రంలో వైద్య సిబ్బంది పరీక్షించగా, అతనిలో ఎబోలా వైరస్ లక్షణాలు ఉన్నట్లు బయటపడింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్ట్ హెల్త్ అథారిటీస్ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి, ప్రత్యేక అంబులెన్స్‌లో అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఐసోలేషన్ వార్డుకు తరలించారు. ప్రస్తుతం ఆ రోగికి అత్యవసర చికిత్స అందిస్తూనే, ఎబోలా వైరస్ ఉనికిని నిర్ధారించుకునేందుకు అతని శరీరం నుండి రక్త నమూనాలనుసేకరించి హైదరాబాద్‌లోని సీసీఎంబీ ల్యాబొరేటరీకి పరీక్షల నిమిత్తం పంపించినట్లు గాంధీ ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో విమానాశ్రయం మరియు వైద్య ఆరోగ్య శాఖ వర్గాల్లో ఒక్కసారిగా హై అలర్ట్ ప్రకటించారు.

# పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

**మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి**

**ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు**

**బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు**

హైదరాబాద్,జూన్4(ఆర్ఎన్ఎ): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ

సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు.

కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు.

# గూగుల్ తీరును అభినందించన ఉదయ్ కోటక్

ముంబై,జూన్4(ఆర్ఎన్ఎ): కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ తాజాగా భారతీయ వ్యాపార సంస్థలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దిగ్గజ కార్పొరేట్ సంస్థలు వేల కోట్లను ఆర్జిస్తున్నప్పటికీ సంతృప్తి చెందకుండా భవిష్యత్తుపై పెట్టుబడులు పెడుతున్న వైనాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా గూగుల్ గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సంస్థ ఆర్థిక సామర్థ్యం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందని అన్నారు. 'గూగుల్ వార్షిక లాభం 160 బిలియన్ డాలర్లు. గత త్రైమాసికంలో 62 బిలియన్‌లను ఆర్జించింది. సంస్థ మార్కెట్ విలువ 4.5 ట్రిలియన్‌లు. భారతీయ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్, లాభాల కంటే ఇది ఎక్కువ. ఇది భారతీయ కంపెనీలకు మేలు కొలుపు కావాలి. ప్రస్తుత పరిస్థితి ఎంత మెరుగ్గా ఉన్నప్పటికీ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టాలి' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# 'ఓఎస్ఎం'పై ఐఐటీ నిపుణుల నివేదిక

**కోఎంప్ట్ సంస్థకు నైపుణ్యం లేదన్న ప్యానెల్.. ఏడబ్ల్యూఎస్‌కు డేటా బదిలీ!**

**ఐఐటీ కాన్పూర్, ఐఐటీ మద్రాస్ ఉన్నతస్థాయి కమిటీ దర్యాప్తులో షాకింగ్ నిజాలు**

**చొరబాటుకు శక్తిమంతమైన క్లాడ్ టూల్స్ వినియోగం**

**ఇది ఎథికల్ హ్యాకర్ల పనిగా అనుమానిస్తున్న అధికారులు**

న్యూఢిల్లీ, జూన్ 04: సీబీఎస్ఈ ఈ ఏడాది 12వ తరగతి పరీక్షల మూల్యాంకనం కోసం తీసుకువచ్చిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థ దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పరీక్షల జవాబు పత్రాలు మారిపోయాయంటూ కొందరు విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో పెద్ద ఎత్తున దుమారం రేగింది. ఈ సీబీఎస్ఈ పోర్టల్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఐఐటీ కాన్పూర్, ఐఐటీ మద్రాస్ నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి ప్యానెల్‌ను నియమించింది. ఈ కమిటీ జరిపిన సమీక్షలో.. సీబీఎస్ఈ, ఓఎస్ఎం పోర్టల్స్‌లో ఉన్న సాంకేతిక భద్రతా లోపాలను గుర్తించి, వాటిలోకి చొరబడేందుకు అత్యంత శక్తిమంతమైన క్లాడ్ టూల్స్‌ను వినియోగించినట్లు వార్తలు వస్తున్నాయి.

**ఐఐటీ నిపుణుల కమిటీ గుర్తించిన కీలక అంశాలు**

- నిర్వహణ సంస్థ వైఫల్యం: 12వ తరగతి పరీక్షల మూల్యాంకనం కోసం ప్రవేశపెట్టిన డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'ఓఎస్ఎం'ను నిర్వహిస్తోన్న 'కోఎంప్ట్ ఎడ్యుటెక్' సంస్థకు ఆ పోర్టల్‌ను సురక్షితంగా ఉంచేందుకు కావాల్సిన కనీస సాంకేతిక నైపుణ్యం, అవగాహన లేవని ఈ ఉన్నతస్థాయి ప్యానెల్ కనుగొంది.
- ఏడబ్ల్యూఎస్‌కు డేటా తరలింపు: నిర్వహణ సంస్థ లోపాలు బయటపడటంతో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, ఓఎస్ఎం డేటా మొత్తాన్ని అత్యంత సురక్షితమైన అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) ఇండియా విభాగానికి అత్యవసరంగా తరలించింది.
- పోర్టల్ పునరుద్ధరణ: ఈ ఐఐటీ నిపుణుల బృందం చేసిన నిరంతర సాంకేతిక ప్రయత్నాల వల్లే, కొంత ఆలస్యం జరిగినప్పటికీ సీబీఎస్ఈ వెరిఫికేషన్, రీవాల్యుయేషన్ పోర్టల్ తిరిగి విజయవంతంగా లైవ్‌లోకి వచ్చింది.
- అదనపు బాధ్యతలు: ఈ ప్యానెల్ యొక్క సమర్థతను చూసిన కేంద్ర ప్రభుత్వం, దేశంలోని ఇతర ముఖ్యమైన పరీక్షలకు సంబంధించిన డిజిటల్ వ్యవస్థలను కూడా సమీక్షించే అదనపు బాధ్యతను ఈ కమిటీకే అప్పగించింది.



**ఎథికల్ హ్యాకింగ్ కోణం.. సైబర్ సెక్యూరిటీపై ప్రశ్నలు!**

ఇదిలావుండగా, ఈ సీబీఎస్ఈ పోర్టల్ వ్యవహారాన్ని ప్రభుత్వం కేవలం ఒక సాధారణ సైబర్ దాడిగా మాత్రమే పరిగణించడం లేదు. సదరు సిస్టమ్ పూర్తిగా లైవ్‌లోకి రావడానికి సిద్ధమవుతోన్న తరుణంలో, అందులోని సాంకేతిక భద్రతా లోపాలను బహిర్గతం చేయడానికి 'ఎథికల్ హ్యాకర్లు' చేసిన వ్యూహాత్మక చర్యగా కొందరు ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇది ఏ తరహా హ్యాకింగ్ అయినప్పటికీ.. ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగే ఇలాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులలో పాటించాల్సిన సైబర్ సెక్యూరిటీ ప్రమాణాలు మరియు వాటి రక్షణ వలయాలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రశ్నలు లేవనెత్తిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

జగిత్యాల, జూన్ 4

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సాధారణ తనిఖీలలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం దరూర్ క్యాంప్‌లోని ఈవీఎంల భద్రపరిచిన గోదామును పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదాములోని భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాల పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. యంత్రాల భద్రత, గోదాములో అమర్చిన సీసీ కెమెరాల పనితీరు, ఇతర సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రతినెలా ఎన్నికల యంత్రాల భద్రతపై సాధారణ తనిఖీలు నిర్వహించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పరికరాల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.



## పట్టణాభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

హైదరాబాద్, జూన్ 4

పట్టణ పాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు పౌర సేవలను వేగవంతంగా అందించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరే షన్ కమిషనర్ ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహిం చారు. జోనల్ కమిషనర్లు, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి, పట్టణ ప్రణాళిక అధికారులు, డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి పలు కీలక అంశాలపై చర్చించారు. సమావేశంలో క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కారం, నిర్మాణ అనుమతులు, అభివృద్ధి హక్కుల బదిలీ దరఖాస్తులు, పెండింగ్ న్యాయ వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, ఆక్రమణల తొలగింపు, రహదారి విస్తరణకు సంబంధించిన భూసేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సన్నద్ధత చర్యలపై సమావేశంలో చర్చించారు.



## ప్రత్యేక తనిఖీల్లో వెలుగులోకి ఉల్లంఘనలు

సిరిసిల్ల, జూన్ 4

సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్, నంబర్ ప్లేట్ తొలగింపు, నంబర్ ప్లేట్ మార్ఫింగ్ వంటి ఉల్లంఘనలను గుర్తించి కేసులు నమోదు చేశారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో పలువురు వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది. నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే నంబర్ ప్లేట్లను తొలగించిన లేదా ఉద్దేశపూర్వకంగా మార్పులు చేసి స్పష్టంగా కనిపించకుండా చేసిన 24 వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్లను తొలగించడం, వాహనాల నమోదు సంఖ్యలను మార్ఫింగ్ చేయడం చట్టవిరుద్ధమని పోలీసులు హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తన వాహనానికి నంబర్ ప్లేట్ స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# శాస్త్రీయ విధానంలో భూముల విలువల పునర్వ్యవస్థీకరణ

## రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్ 4

తెలంగాణలో రెవెన్యూ శాఖలో విస్తృత సంస్కరణలు చేపడుతున్నామని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం గచ్చిబౌలిలోని తాళీం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ రేటును 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందని



గుర్తుచేశారు. ప్రజలపై అదనపు భారం పడకుండా మార్కెట్ విలువలకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువలను పునర్నిర్ణయించినట్లు తెలిపారు. అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా సబ్-రిజిస్ట్రార్ల అధికారాలను పరిమితం చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల కనిష్ఠ విలువను ఎకరానికి రూ.2.75 లక్షలుగా నిర్ణయించామని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.5 లక్షలు, హెచ్ఎండీఏ పరిధిలో రూ.10 లక్షలు, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో రూ.15 లక్షలుగా కనిష్ఠ విలువలను ఖరారు చేసినట్లు వెల్లడించారు. భూముల విలువల నిర్ణయంలో ఎక్కడైనా లోపాలు లేదా అసమానతలు ఉంటే వాటిని సమీక్షించి సరిదిద్దుతామని తెలిపారు. కొత్త భూముల విలువలపై సందేహాలు, ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 4788, వాట్సాప్ నంబర్ 8247619983 అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై వస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ, "ఫ్యూచర్ సిటీని రద్దు చేయడం సాధ్యం కాదు. అక్కడ భూములు ఉచితంగా ఇవ్వలేదు. ప్రాజెక్టును రద్దు చేస్తే ప్రభుత్వమే చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించాల్సి వస్తుంది. అది సాధ్యపడే విషయం కాదు" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# నగర రవాణాకు ఊతమిచ్చే పనులు

హైదరాబాద్, జూన్ 4



నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు చేపడు తున్న కీలక మౌలిక వసతుల పనులను జీహెచ్ఎంసీ కమిషనర్ గురువారం పరిశీలించారు. ప్రధాన ఇంజనీర్, జోనల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నాల్గొండ ఫ్లైఓవర్, మూసారాంబాగ్ దిగువ వంతెన నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. మొదటగా నాల్గొండ ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన కమిషనర్ నిర్మాణ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 85 స్పాన్లలో 79 స్పాన్లకు డెక్ స్లాబ్ పనులు పూర్తయ్యా యని, అన్ని 85 స్పాన్లకు గిర్డర్ల ఏర్పాటు పూర్తయిందని అధికారులు వివరించారు. ఎగువ, దిగువ ర్యాంపుల నిర్మాణ పనులు కూడా సమాంతరంగా కొనసాగుతు న్నాయని తెలిపారు.ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయిన తర్వాత నగరంలోని ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుందని అధికారులు పేర్కొన్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా మిగిలిన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. అనంతరం మూసా రాంబాగ్ దిగువ వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు.

వంతెనలో కీలక భాగమైన ఒక విభాగానికి సంబంధించిన అడుగు స్లాబ్ పనులు పూర్తయ్యాయని, చివరి స్పాన్ నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. అంబర్‌పేట్ వైపున రిటైనింగ్ గోడ నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్వరగా ప్రయోజనం చేకూరేలా నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాకపోకలు మరింత సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు. నాల్గొండ ఫ్లైఓవర్, మూసారాంబాగ్ వంతెన నిర్మాణాలను వచ్చే నెలలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

హైదరాబాద్, జూన్ 4



మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని మార్కెట్ పోలీసులు భారీ ఇంటి చోరీ కేసును ఛేదించారు. గోవాకు చెందిన అలవాటైన అంతర్రాష్ట్ర నేరస్థుడిని అరెస్టు చేసి, చోరీకి గురైన బంగారం, వెండి ఆభరణాలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తి విలువ సుమారు రూ.82 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇటీవల జరిగిన ఇంటి చోరీ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన మార్కెట్ పోలీసు బృందం సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారాన్ని విశ్లేషించి నిందితుడిని గుర్తించింది. పలు రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడిన చరిత్ర ఉన్న వ్యక్తిగా అతడిని పోలీసులు గుర్తించారు.కేసు దర్యాప్తులో పోలీసులు చూపిన చాకచక్యం, సమన్వయం, వేగవంతమైన చర్యల ఫలితంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును పూర్తిగా రికవరీ చేశారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. నివాసాల వద్ద నిఘా కెమెరాలు ఏర్పా టు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని సూచించారు.

# గ్రామసభల్లో ప్రజా సమస్యలపై చర్చ

మహబూబాబాద్, జూన్ 4



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య క్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువా రం గూడూరు మండలంలోని అప్పలరాజుపల్లి, పొనుగో డు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై గ్రామస్థులతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గ్రామస్థుల నుంచి సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరును కూడా కలెక్టర్ పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జనగణన సర్వే నిర్వహణపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వ హించా లని అధికారులకు సూచి ంచారు. ప్రతి కుటుంబ వివరాలు సక్రమంగా నమోదు కావడం అత్యం త ముఖ్యమని పేర్కొన్నా రు.ప్రజాపాలన కార్యక్ర మాల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరిం త చేరువ చేయ డమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. గ్రామ స్థులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కీలకమని కలెక్టర్ స్నేహ శబరీష్ పేర్కొన్నారు.

## లక్కీడ్రాల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

**పీడీ యాక్ట్‌తో జైలుకు పంపిస్తాం: ఎస్పీ నరసింహ**

సూర్యాపేట, జూన్ 4

లక్కీ డ్రాల పేరుతో ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, విలువైన వస్తువులు బహుమతులుగా ఇస్తామని ప్రజలను ఆశపెట్టి డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలు, ఇతర ఖరీదైన బహుమతులు గెలుచుకునే అవకాశం ఉందంటూ "పరిమిత టోకెన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి" అనే ప్రచారాలతో ప్రజలను ఆకర్షించి డబ్బులు వసూలు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి లక్కీ డ్రాల నిర్వహణకు ఎలాంటి అధికారిక అనుమతులు లేవని, ఇవి సామాజికంగా మరియు ఆర్థికంగా ప్రజలను మోసం చేసే నేరపూరిత చర్యలని పేర్కొన్నారు. కొద్దిపాటి పెట్టుబడితో భారీ లాభాలు, ప్లాట్లు, భూములు లేదా ఇతర విలువైన బహుమతులు గెలుచుకోవచ్చని చెప్పే ప్రకటనలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్లు తెరవడం, అవసరమైతే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుని జైలుకు పంపడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఇటువంటి మోసపూరిత కార్యకలాపాలపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఉంచిందని తెలిపారు. ఎవరైనా లక్కీ డ్రాల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం తెలిసినా, లేదా బాధితులుగా మారినా వెంటనే సమీప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజలు అత్యాశకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని, చట్టవిరుద్ధమైన లక్కీ డ్రాలు, బహుమతి పథకాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్పీ నరసింహ సూచించారు. ఇటువంటి ఆర్థిక మోసాలను అరికట్టేందుకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.



## సర్వమత ఆశీస్సులతో జన్మదినం

వికారాబాద్, జూన్ 4

తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలో సర్వమత ప్రార్థనలు నిర్వహిం చారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన పూజారులు, మత గురువులు, పాస్టర్లు స్పీకర్‌కు ప్రత్యేక ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి స్పీకర్ ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సర్వమత సామరస్యానికి ప్రతీకగా జరిగిన ఈ కార్యక్ర మంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.అనంతరం తన జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో గడ్డం ప్రసాద్ కుమార్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# కరీంనగర్ జిల్లాలో నాణ్యమైన విద్యే లక్ష్యం

## డీఈఓ ప్రశాంత్ రెడ్డి



కరీంనగర్: జూన్ 5

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి (ణజుూ) ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉంటూ, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పూర్తి స్థాయిలో చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్ రెడ్డిని, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా, ఈ విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదును 10 శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు నలుమాసు సుదర్శన్ మాట్లాడుతూ, డీఈఓ సూచనలను అమలు చేస్తూ విద్యాభివృద్ధికి ప్రధానోపాధ్యాయులంతా కృషి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే, జిల్లాలోని ప్రధానోపాధ్యాయులతో త్వరలోనే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాపల్లి శ్రీనివాస్ కోరగా, డీఈఓ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఆ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అనురాధ, కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, డి. శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి, వి. శ్రీనివాస్, జిల్లా పరీక్షల కార్యదర్శి భగవంతయ్య, మండల విద్యాధికారులు శోభారాణి, శ్రీనివాస్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పద్మ, అనిత కుమారి, శశికాంత్ రెడ్డి, బి. శ్రీనివాస్, నరసింహ రెడ్డి, సతీష్, శ్రీనివాస్, సంపత్ కుమారాచార్య తదితరులు పాల్గొన్నారు

# సాలార్ జంగ్ మ్యూజియం అభివృద్ధికి పీఎస్‌యూలు సహకరించాలి

## ప్లాటినం జూబ్లీ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

హైదరాబాద్, జూన్ 4

ప్లాటినం జూబ్లీ వేడుకలకు సిద్ధమవుతున్న సాలార్ జంగ్ మ్యూజియం ఆధునీకరణ, విస్తరణ కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) సహకారం అందించాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. సాలార్ జంగ్ మ్యూజియం చైర్మన్‌గా ఉన్న గవర్నర్ గురువారం రాజ్‌భవన్‌లో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో సమావేశమై జూన్ 14 నుంచి 21 వరకు నిర్వహించనున్న ప్లాటినం జూబ్లీ వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణ్ ఆచార్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, సాలార్ జంగ్--3గా ప్రసిద్ధి చెందిన నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలు, ప్రచురణలు, ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లలో సాలార్ జంగ్ మ్యూజియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలున్న ఆధునిక సంస్థగా తీర్చిదిద్దేందుకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తూ, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా మ్యూజియం అభివృద్ధికి తోడ్పడాలని పీఎస్‌యూలను కోరారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్ మాట్లాడుతూ, మూసీ నది తీరాభివృద్ధి, సుందరీకరణ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందన్నారు. తెలంగాణ హైకోర్టు, సాలార్ జంగ్ మ్యూజియం, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి పరిసరాలను వారసత్వ కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. గవర్నర్ విజ్ఞప్తికి స్పందించిన ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు మ్యూజియం ఆధునీకరణ, విస్తరణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యే అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో సాలార్ జంగ్ మ్యూజియం అధికారులు భవిష్యత్ అభివృద్ధి కార్యాచరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

రాబోయే ఐదేళ్లలో గ్యాలరీల అభివృద్ధి, నిల్వ సదుపాయాల విస్తరణ, పురావస్తు పరిరక్షణ మౌలిక వసతుల మెరుగుదలకు రూ.25 కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకు వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే విద్యా కార్యక్రమాల విస్తరణ, పరిరక్షణ ప్రయోగశాలల ఆధునీకరణ, సందర్శకుల సేవల మెరుగుదల, ప్రజా సౌకర్యాల విస్తరణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక "తెలంగాణ హెరిటేజ్ వింగ్" ఏర్పాటుకు సుమారు రూ.85 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మ్యూజియం అధికారులు తెలిపారు.

# వర్షపాతాన్ని బట్టి పంటలు సాగు చేయాలి: ప్రత్యేక అధికారి దయానందరాణి

చిలుకూరు, జూన్ 4

చిలుకూరు మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన '99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' గ్రామసభలో ప్రత్యేక అధికారి దయానందరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత వర్షపాత పరిస్థితులు, ఎల్-నినో (జుశ్రీ-చీఱఅశీ) ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు.

**గ్రామసభలో ఆమె చేసిన ప్రధాన సూచనలు:**

**పంటల మార్పిడి:** రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, వర్షపాతానికి అనుగుణంగా పంట మార్పిడి పద్ధతులను పాటించాలని సూచించారు.



**ప్రభుత్వ రాయితీలు:** విత్తన సబ్సిడీ, ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**నీటి సంరక్షణ:** వర్షపు నీటిని చెరువులు, కుంటల్లో నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, ఈ దిశగా రైతులు దృష్టి సారించాలని అన్నారు.

**విద్యారంగం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు (ఎన్రోల్మెంట్) పెంచేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగయ్య, ఎంపీడీఓ ముక్కపాటి నరసింహా రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్, విద్యుత్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలే 'యూనిఫాం లేని పోలీసులు'

## సూర్యాపేట ఎస్పీ నరసింహా

సూర్యాపేట, జూన్ 4

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో భాగంగా చివ్వెంల మండలం, సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు కుడకుడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా ఎస్పీ నరసింహా (ఐపీఎస్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, గ్రామ, వార్డు సభల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

**ప్రధానాంశాలు:**

ప్రజలే రక్షకులు: స్థానిక సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిల కదలికలపై సమాచారం అందించడంలో ప్రతి పౌరుడు 'యూనిఫాం లేని పోలీస్'గా వ్యవహరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత: సోషల్ మీడియాలో వచ్చే నమ్మదగని ప్రకటనలు, బ్లూ లింకులను నమ్మి వ్యక్తిగత వివరాలను ఇస్తూ ఆర్థికంగా నష్టపోవద్దని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మహిళా భద్రత ఓ గంజాయి నిర్మూలన: మహిళల భద్రతకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యతనిస్తోందని, సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి వంటి




మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సులభతరమైన ఫిర్యాదులు: బాధితులు పోలీస్ స్టేషన్ వరకు రాలేని పరిస్థితుల్లో 'డయల్ 100' లేదా '112'కు సమాచారం ఇస్తే, పోలీసులే నేరుగా బాధితుల వద్దకు వచ్చి కేసులు నమోదు చేస్తున్నారని ఎస్పీ వివరించారు. తగాదాలకు దూరంగా ఉండి సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఇబ్బందులు తప్పవని ఆయన హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలోనూ ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, స్థానిక కౌన్సిలర్, హెల్త్ సెంటర్ వైద్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ అధికారులు, స్థానిక ఎస్ఐ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా చలమల్ల నర్సింహ నియామకం

**ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ**

సూర్యాపేట, జూన్ 4

తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టీయూవీ) సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమకారుడు చలమల్ల నర్సింహను రాష్ట్ర కమిటీ నియమించింది. ఈ మేరకు సంస్థ రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చలమల్ల నర్సింహ చురుకుగా పాల్గొని ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం వివిధ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ కాలంలో రాజకీయ జేఏసీ సూర్యాపేట కో-కన్వీనర్‌గా సేవలందిస్తూ అనేక ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలమల్ల నర్సింహ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా మరింత సహాయం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తెలంగాణ ఉద్యమకారుల వేదిక తరపున కృషి కొనసాగిస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో సేవలందించిన ప్రతి ఉద్యమకారుడికి తగిన గుర్తింపు, గౌరవం, సంక్షేమం అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చలమల్ల నర్సింహకు పలువురు ఉద్యమకారులు శుభాకాంక్షలు తెలిపారు.



## ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా

# ఓరుగంటి ప్రభాకర్

కోదాడ, జూన్ 5

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన సీనియర్ నాయకుడు ఓరుగంటి ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని వాసవి భవన్‌లో రాష్ట్ర కమిటీ నియామకాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ నియామక పత్రాన్ని అందజేసి ప్రభాకర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఓరుగంటి ప్రభాకర్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మహాసభ సీనియర్ నాయకుడు ఊరే లక్ష్మణ్, జిల్లా మహాసభ అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు, కోదాడ పట్టణ అధ్యక్షుడు పైడిమరి నారాయణరావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్య సమాజాన్ని రాజకీయంగా మరింత చైతన్యవంతం చేయడంతో పాటు మహాసభ బలోపేతానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు




# తనిఖీలకు ముందే తాళం

**అధికారులపై అనుమానాల మేఘం**

కోదాడ, జూన్ 5

కేసు నమోదైన వైన్ షాపును నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రముఖులు మిర్యాల నాగేశ్వరరావు, సయ్యద్ బాబా ఆరోపించారు. ఈ మేరకు గురువారం కోదాడ ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. వారి కథనం ప్రకారం, ఖమ్మం క్రాస్ రోడ్డులో ఉన్న స్వాగత్ వైన్స్‌పై గత నెల చివరలో కేసు నమోదైనప్పటికీ యథేచ్ఛగా వ్యాపారం కొనసాగుతోందన్నారు. అయితే స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీల కోసం వస్తున్న సమాచారం ముందుగానే సంబంధిత వైన్స్ నిర్వాహకులకు చేరడంతో షాపును మూసివేశారని ఆరోపించారు. తనిఖీలు జరగకముందే షాప్‌కు తాళం పడటంపై అనుమానాలు వ్యక్తం చేసిన వారు, ఉన్నతాధికారుల తనిఖీలకు సహకరించాల్సిన కొందరు అధికారులు అక్రమాలకు అండగా నిలుస్తున్నారనే సందేహాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే సంబంధిత వైన్స్ లైసెన్స్‌ను తక్షణమే రద్దు చేయాలని మిర్యాల నాగేశ్వరరావు, సయ్యద్ బాబా డిమాండ్ చేశారు. ఫిర్యాదుపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలా స్పందిస్తారన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# తెలంగాణలో మద్యం ధరల పెంపు దిశగా కసరత్తు



**తెలంగాణలో మద్యం ధరల పెంపు అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మద్యం తయారీ వ్యయం గణనీయంగా పెరిగిందని పేర్కొంటూ, కొనుగోలు ధరలను కనీసం పది శాతం పెంచాలని తయారీ సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.**

**హైదరాబాద్, జూన్ 4 :**

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సునీల్ కిషోర్ జైస్వాల్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. మద్యం ధరల పెంపుపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించేందుకు కమిటీ ఇప్పటికే తయారీ సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తోంది. ఒకవైపు సంస్థల ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటూనే, మరోవైపు రాష్ట్ర ఆదాయంపై ప్రభావం పడకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ధరలు పెరిగితే ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమ మద్యం రవాణా పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన అధికారుల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, గద్వాల వంటి సరిహద్దు జిల్లాల్లో తక్కువ ధరల కోసం పొరుగు రాష్ట్రం వైపు వినియోగదారులు మొగ్గు చూపే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలా జరిగితే తెలంగాణకు వచ్చే ఎక్సైజ్ ఆదాయం తగ్గే ప్రమాదం ఉంది. ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు కట్టుదిట్టం చేసినప్పటికీ, రెండు రాష్ట్రాల మధ్య ధరల్లో పెద్ద వ్యత్యాసం ఉంటే అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడం సవాలుగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. అందుకే రెండు రాష్ట్రాల ధరల మధ్య సమతుల్యతను కాపాడే విధంగా నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన సమావేశంలో ముడి పదార్థాల ధరలు, రవాణా వ్యయాలు గణనీయంగా పెరిగాయని తయారీ సంస్థలు కమిటీ దృష్టికి తీసుకెళ్లాయి. ప్రస్తుత ధరలతో వ్యాపారం కొనసాగించడం కష్టంగా మారిందని అవి వివరించాయి. కమిటీ ఈ వాదనలను పరిశీలించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలను కూడా సమీక్షిస్తోంది. రాబోయే మూడు రోజుల్లో కమిటీ తన అధ్యయనాన్ని పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా మద్యం ధరల పెంపుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ధరలు పెరిగితే వినియోగదారులపై అదనపుభారం పడే అవకాశముండగా, పెంపు ఎంత మేర ఉంటుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం కమిటీ నివేదిక కోసం మద్యం వ్యాపారులు, వినియోగదారులు ఎదురుచూస్తున్నారు.




# పటిదార్‌కు గుర్తింపు కావాలి

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పటిదార్‌కు రావాల్సిన స్థాయిలో గుర్తింపు లభించడం లేదని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ అభిప్రాయపడ్డాడు. జట్టులో విరాట్ కోహ్లీ వంటి స్టార్ ఆటగాడు ఉండటం వల్ల పటిదార్ ప్రదర్శనలు పెద్దగా చర్చకు రావడం లేదని పేర్కొన్నాడు.ఇటీవల ఓ క్రికెట్ చర్చా కార్యక్రమంలో మాట్లాడిన క్లార్క్, ఐపీఎల్ 2026 సీజన్‌లో తన దృష్టిలో అత్యంత తక్కువ గుర్తింపు పొందిన ఆటగాడు రజత్ పటిదారేనని వ్యాఖ్యానించాడు.**

**మెల్‌బోర్న్, జూన్ 4 :**

ఆర్‌సీబీకి వరుసగా రెండు సార్లు టైటిల్ అందించిన కెప్టెన్‌గా, జట్టును విజయవంతంగా ముందుండి నడిపించిన నాయకుడిగా పటిదార్ మరింత ప్రశంసలు అందుకోవాల్సిన అవసరం ఉందని చెప్పాడు. జట్టులో కోహ్లీ వంటి దిగ్గజ ఆటగాడు ఉండటంతో సహజంగానే ఎక్కువ చర్చ అతని చుట్టూనే జరుగుతుందని, అయితే పటిదార్ నాయకత్వం, బ్యాటింగ్ ప్రదర్శనలను కూడా అదే స్థాయిలో గుర్తించాలని క్లార్క్ సూచించాడు. ఒక కెప్టెన్‌గా ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టడంలో పటిదార్ అద్భుతమైన సామర్థ్యాన్ని కనబరిచాడని కొనియాడాడు. టీ20 క్రికెట్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయడం అత్యంత క్లిష్టమైన బాధ్యత అని, అలాంటి కీలక స్థానంలో వచ్చి దూకుడుగా పరుగులు చేయడం పటిదార్ ప్రత్యేకత అని క్లార్క్ వివరించాడు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడుతూ జట్టుకు అవసరమైన వేగంతో పరుగులు సాధించడం అతని బలమని పేర్కొన్నాడు ఐపీఎల్ 2026 సీజన్‌లో పటిదార్ సుమారు 200 స్ట్రైక్‌రేట్‌తో 501 పరుగులు సాధించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. బ్యాటర్‌గా మాత్రమే కాకుండా కెప్టెన్‌గా కూడా అతడు అసాధారణ ప్రతిభ కనబరిచాడని క్లార్క్ అభిప్రాయపడ్డాడు. పటిదార్ నిలకడైన ప్రదర్శనలు, నాయకత్వ నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకుని భారత టీ20, వన్డే జట్ల ఎంపికలో అతనికి ప్రాధాన్యం ఇవ్వాలని క్లార్క్ సూచించాడు. వరుసగా రెండు ఐపీఎల్ ట్రోఫీలు గెలిచిన కెప్టెన్‌గా అతని పేరు భారత జట్టు ఎంపికలో ముందువరుసలో ఉండాలని స్పష్టం చేశాడు. ప్రస్తుతం దేశీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లోనూ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న పటిదార్, భవిష్యత్తులో భారత జట్టులో కీలక పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తగ్గిన బంగారం, వెండి ధరలు

**హైదరాబాద్, జూన్ 4 :**



పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించే విధంగా బంగారం ధరలు వరుసగా తగ్గుముఖం పట్టాయి. గత వారం రోజులుగా బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల కొనసాగుతుండగా, గురువారం కూడా ధరలు తగ్గాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఉపశమనం లభించింది. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.110, 22 క్యారెట్ల బంగారంపై రూ.100, 18 క్యారెట్ల బంగారంపై రూ.90 మేర ధర తగ్గింది. ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,56,110గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,100గా, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,17,080గా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ఒకే స్థాయిలో కొనసాగుతోంది. హైదరాబాద్, అమరావతి, విజయవాడ, రాజమండ్రి, అనంతపురం, వరంగల్, కడప నగరాల్లో 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,110గా ఉంది.




# సూర్యకు కెప్టెన్సీ గండం?

**న్యూఢిల్లీ, జూన్ 4 :**

టీ20 ప్రపంచకప్‌ను భారత జట్టుకు అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు భారీ షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. జూన్, జులై నెలల్లో జరగనున్న ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు ముందే అతడిని టీ20 జట్టు సారథ్య బాధ్యతల నుంచి తప్పించే దిశగా భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆలోచిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. గత కొంతకాలంగా సూర్యకుమార్ యాదవ్ తీవ్ర ఫామ్ లేమితో ఇబ్బందులు పడుతుండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు.

ఒకప్పుడు ప్రపంచ టీ20 క్రికెట్‌లో అగ్రశ్రేణి బ్యాటర్‌గా గుర్తింపు పొందిన సూర్యకుమార్ యాదవ్, ప్రస్తుతం పరుగులు చేయడంలో తడబడుతున్నాడు. ఇటీవల ముగిసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో కూడా అతడి ప్రదర్శన నిరాశపరిచింది. ముంబై జట్టు తరఫున 13 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసిన అతడు కేవలం 270 పరుగులు మాత్రమే సాధించాడు. 2017 తర్వాత అతడికి ఇదే అత్యంత పేలవమైన లీగ్ సీజన్‌గా నమోదైంది. ఈ పరిస్థితుల్లో సూర్యను కేవలం కెప్టెన్సీ నుంచే కాకుండా జట్టు నుంచి కూడా తప్పించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, ప్రధాన ఎంపికల కమిటీ అధిపతి అజిత్ అగార్కర్‌లతో భారత క్రికెట్ బోర్డు ఉన్నతాధికారులు ఇప్పటికే సమావేశమై భవిష్యత్ వ్యూహంపై చర్చించినట్లు తెలుస్తోంది. రాబోయే టీ20 సిరీస్‌ల కోసం కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియను ప్రారంభించాలని సూచించినట్లు క్రీడా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారత జట్టు భవిష్యత్ ప్రణాళికలను దృష్టిలో పెట్టుకుని యువ నాయకత్వానికి అవకాశం ఇవ్వాలని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం.

# లార్డ్స్ చారిత్రాత్మక రికార్డు

**ఇంగ్లాండ్ - న్యూజిలాండ్ తొలి టెస్టుతో అరుదైన ఘనత**

**ప్రపంచ క్రికెట్‌లో మరే మైదానానికి సాధ్యం కాని రికార్డు**

**భారత్‌లో 43 టెస్టులతో ఈడెన్ గార్డెన్స్ టాప్**

స్పోర్ట్స్ డెస్క్, జూ 4: క్రికెట్ అనగానే ప్రపంచవ్యాప్తంగా క్రీడాభిమానులకు ఠక్కున గుర్తుకొచ్చేది లార్డ్స్ మైదానం. తాజాగా ఇంగ్లాండ్ – న్యూజిలాండ్ జట్ల మధ్య ఇక్కడ తొలి టెస్టు మ్యాచ్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌తో లార్డ్స్ స్టేడియం ప్రపంచ క్రికెట్‌లో సరికొత్త చారిత్రాత్మక ఘనతను సాధించింది. ఈ అరుదైన మైలురాయి విషయంలో ప్రపంచంలోని మరే ఇతర మైదానం కూడా లార్డ్స్ దరిదాపుల్లో లేకపోవడం విశేషం. ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు కేవలం మూడు మైదానాల్లో మాత్రమే వందకు పైగా టెస్టు మ్యాచ్‌లు జరిగాయి. అందులో లార్డ్స్ మైదానమే మొదటి స్థానంలో నిలిచింది. అంతేకాకుండా, ప్రపంచంలోనే 150 టెస్టుల మైలురాయిని చేరుకున్న ఏకైక మైదానంగా లార్డ్స్ సరికొత్త రికార్డును లిఖించింది. ప్రస్తుతం ఇంగ్లాండ్ – కివీస్ మధ్య ఇక్కడ జరుగుతున్న మ్యాచ్ లార్డ్స్ చరిత్రలోనే 150వ టెస్టు మ్యాచ్ కావడం గమనార్హం.



**ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా టెస్టులు జరిగిన టాప్ మైదానాలు**

- లార్డ్స్ (ఇంగ్లాండ్): 150 టెస్టులతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.
- మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఆస్ట్రేలియా): ఇక్కడ ఇప్పటివరకు 118 టెస్టులు జరిగాయి.
- సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఆస్ట్రేలియా): ఈ మైదానం 114 టెస్టులతో తర్వాతి స్థానంలో ఉంది.

**భారత మైదానాల రికార్డులు**

- ప్రపంచ రికార్డులతో పోలిస్తే భారత మైదానాల్లో జరిగిన టెస్టుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. మన దేశంలో అత్యధిక టెస్టు మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన మైదానాల వివరాలు ఇలా ఉన్నాయి.
- ఈడెన్ గార్డెన్స్ (కోల్‌కతా): భారత్‌లోనే అత్యంత పెద్ద స్టేడియమైన ఈ మైదానంలో ఇప్పటి వరకు కేవలం 43 టెస్టులు మాత్రమే జరిగాయి. అయినప్పటికీ, భారతదేశంలో ఇవే అత్యధిక టెస్ట్ మ్యాచ్‌లు కావడం విశేషం.
- చెపాక్ (చెన్నై): ఈడెన్ గార్డెన్స్ తర్వాత చెన్నైలోని చెపాక్ మైదానం ఇప్పటివరకు 35 టెస్టులకు విజయవంతంగా ఆతిథ్యమిచ్చింది.

## ప్రశాంత్ నీల్‌కు తారక్ ప్రత్యేక శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 4

ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ పుట్టిన రోజు సందర్భంగా అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్ నీల్‌తో తన అనుబంధాన్ని, అలాగే వీరిద్దరి కలయికలో తెరకెక్కుతున్న భారీ చిత్రాన్ని గుర్తు చేస్తూ తారక్ చేసిన సందేశం ప్రస్తుతం అభిమానులను విశేషంగా ఆకట్టు కుంటోంది.తన సందేశంలో తారక్ మాట్లాడుతూ, "పుట్టినరోజు శుభాకాంక్షలు దర్శకుడి గారూ. మీరు చెప్పే కథల మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అద్భుతంగా సాగాలని కోరుకుంటు న్నాను. మన కలయికలో రూపొం దుతున్న చిత్రం కోసం, అలాగే మన భవిష్యత్తు ప్రయా ణం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా ను" అని పేర్కొన్నారు.ఈ సందేశం లో ప్రశాం త్ నీల్‌ను ఉద్దేశించి తారక్ కన్నడ భాషలో గౌరవసూచకంగా ఉపయోగించే 'అ వరే' అనే పదాన్ని ప్రస్తావించడం తెలుగు, కన్న డ సినీ అభిమా నులను ప్రత్యేకంగా ఆకట్టు కుంది. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.'కేజీఎఫ్', 'సలా ర్' వంటి భారీ విజయాలను అందించిన ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో, జూనియర్ ఎన్టీ ఆర్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అత్యంతప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ భారీ యాక్షన్ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.





## ఓటీటీలోకి 'ధురంధర్ 2'

హైదరాబాద్, జూన్ 4

భారతీయ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న యాక్షన్ చిత్రం 'ధురంధర్ 2: ది రివెంజ్' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరిం చేందుకు సిద్ధమైంది. థియేటర్లలో రూ.1,800 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలనం సృష్టించిన ఈ చిత్రం డిజిటల్ వేదికపైకి అడుగుపెడుతోంది.దేశీయ ప్రేక్షకుల కోసం ప్రముఖ డిజిటల్ వేదిక జియో హాట్‌స్టార్‌లో ఈ చిత్రం గురువారం రాత్రి 7 గంటల నుంచి ప్రత్యేక ప్రీమియర్‌గా అందుబాటులోకి రానుం ది. అనంతరం జూన్ 5 నుంచి సాధారణ ప్రసారానికి సిద్ధమవుతోంది. హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో నూ ఈ చిత్రాన్ని వీక్షించే అవకాశం కల్పించారు.థియేటర్లలో ప్రదర్శించని కొన్ని సన్నివేశాలు, పూర్తి స్థాయి సంభాషణలతో కూడిన ప్రత్యే క సంచికను డిజిటల్ వేదికపై విడుదల చేయ డం విశేషంగా మారింది. ప్రధాన ప్రదర్శనకు ముందు అరగంట నిడివి గల చిత్ర నిర్మాణ విశేషాల కార్యక్రమాన్ని కూడా ప్రసారం చేయ నున్నారు.విదేశాల్లోని ప్రేక్షకుల కోసం ఈ చిత్రం ఇప్పటికే మరో ప్రముఖ డిజిటల్ వేదికలో అందుబాటులోకి వచ్చింది. దర్శకుడు ఆదిత్య ధార్ తెరకెక్కించిన ఈ గూఢచారి యాక్షన్ కథా చిత్రంలో రణ్‌వీర్ సింగ్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.థియేటర్లలో ఈ చిత్రాన్ని చూడలేకపోయిన వారు, మరోసారి ఈ యాక్షన్ కథను ఆస్వాదించాలని భావించే ప్రేక్షకులు ఇప్పుడు ఇంటి వద్ద నుంచే వీక్షించే అవకాశం పొందనున్నారు





## శింబుతో సినిమా చూడాలనుంది - మీనాక్షి

హైదరాబాద్, జూన్ 4

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న కథానాయిక మీనాక్షి చౌదరి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటున్న ఈ అందాల నటి, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమిళ స్టార్ హీరో శింబుపై తన అభిమానాన్ని వ్యక్తం చేశారు.ఇంటర్వ్యూలో భాగంగా "సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా సినిమా చూడడానికి వెళ్లే అవకాశం వస్తే ఎవరిని ఎంచుకుంటారు?" అనే ప్రశ్నకు మీనాక్షి ఏమాత్రం ఆలోచించకుండా శింబు పేరును చెప్పారు. "సినిమా చూడటానికి వెళ్లాలంటే నేను ఖచ్చితంగా శింబు గారినే ఎంచుకుంటాను" అంటూ సమాధానమిచ్చారు. ఆయన నటన, తెరపై కనిపించే తీరు తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు.మీనాక్షి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అభిమానుల మధ్య చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా శింబు అభిమానులు ఈ వ్యాఖ్యలను ఆనందంగా స్వాగతిస్తూ, వీరిద్దరి కలయికలో ఒక చిత్రం వస్తే చూడాలని ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, తమిళ సినీ వర్గాల్లో వినిపిస్తున్న కథనాల ప్రకారం శింబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఓ భారీ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వార్తల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ప్రస్తుతం మీనాక్షి చౌదరి తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో బిజీగా గడుపుతున్నారు. వరుస విజయాలతో ఆమెకు 'అదృష్ట కథానాయిక' అనే పేరు కూడా వచ్చింది. తెలుగులో పలు ప్రతిష్టాత్మక చిత్రాల్లో నటిస్తూనే, తమిళంలోనూ వరుస అవకాశాలను అందుకుంటు న్నారు.హర్యానాకు చెందిన మీనాక్షి చౌదరి వృత్తిరీత్యా దంత వైద్యురాలు. విద్యాభ్యాసం పూర్తయ్యాక మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి జాతీయ స్థాయి అందాల పోటీల్లో గుర్తింపు పొందారు. అనంతరం సినీ రంగంలోకి ప్రవేశించి తన అందం, నటనతో ప్రేక్ష కులను ఆకట్టుకుంటూ అగ్ర కథానాయికల జాబితాలో చోటు సంపాదించారు.ప్రస్తుతం నటిస్తున్న కొత్త చిత్రాలపై కూడా సినీ అభిమాను ల్లో ఆసక్తి నెలకొంది. వరుస విజయాలతో ముందుకు సాగుతున్న మీనాక్షి చౌదరి మీరోవార్తల్లో నిలవడానికి శింబుపై చేసిన ఈ న్యాఖ్యలే కారణమయ్యాయి.

## 'పెద్ది' విజయంపై చిరంజీవి ఆనందం

హైదరాబాద్, జూన్ 4

మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్ చర ణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విడుదలైన తొలి రోజే ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లను రాబడుతోంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటనపై అన్ని వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.సినిమాకు లభిస్తున్న అద్భు త స్పందనపై చిరంజీవి సామాజిక మాధ్యమాల వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చిత్రీకరణ పనుల నిమిత్తం పొల్లాచ్చిలో ఉన్నప్పటికీ, తన ఆలోచనలు మాత్రం 'పెద్ది' విజయోత్సాహంలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు సానా, నిర్మాత వెంకట సతీష్ కిలారు, చిత్రబృందం సభ్యులతో పాటుతన కుమారుడు రామ్ చరణ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపా రు.రామ్ చరణ్ గత రెండేళ్లుగా 'పెద్ది' చిత్రం కోసం ఎంత కష్టపడ్డాడో తాను దగ్గర నుంచి చూశానని చిరంజీవి వెల్లడించారు. పాత్ర కోసం ఆయన చూపించిన అంకితభావం, క్రమ శిక్షణ, పట్టుదల ప్రతి సన్నివేశంలో కనిపి స్తున్నాయని కొనియాడారు. ప్రేక్షకుల నుంచి లభి స్తున్న ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే ఒక తండ్రిగా మాత్రమే కాకుండా, ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తోందని పేర్కొ న్నారు.






## నారప్పతో నా కల నెరవేరిందిప్రియమణి

హైదరాబాద్, జూన్ 4

ప్రముఖ నటి ప్రియమణి 'నారప్ప' చిత్రంలో నటించిన అనుభవాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ సంస్థలో పనిచేయాలన్న తన చిరకాల కోరిక 'నారప్ప' చిత్రంతో నెరవే రిందని ఆమె తెలిపారు.తన వివాహం జరిగిన కొత్తలో రామానాయుడు స్టూడియోకు వెళ్లిన సమయంలో అక్కడ ప్రదర్శించిన అనేక మంది కథానాయికల చిత్రాలను చూసి ఆశ్చర్యపోయినట్లు ప్రియమణి గుర్తు చేసుకున్నారు. అవన్నీ సురేష్ ప్రొడక్షన్స్ సంస్థలో పనిచేసిన నటీమణుల ఫొటోలు అని తెలుసుకున్న తర్వాత, ఒక రోజు తన ఫొటో కూడా అక్కడ ఉండాలని మన స్ఫూర్తిగా కోరుకున్నట్లు చెప్పారు. ఆ కోరికను తాను ఎంతో బలంగా ఊహించుకున్నానని, చివరికి 'నారప్ప' చిత్రం ద్వారా అది నిజమైందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన నిర్మాత సురేష్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సురేష్ బాబు గురించి మాట్లా డుతూ, ఆయన అత్యంత నిబద్ధత కలిగిన నిర్మాత అని కొనియాడారు. చిత్రీ కరణ మొదటి రోజు నుంచే ప్రతి చిన్న విషయాన్ని స్వయంగా పరిశీలిస్తూ, సినిమా నాణ్యత విషయంలో రాజీపడరని చెప్పారు. నటీనటుల రూపకల్పన, దుస్తులు, చిత్రీకరణ వాతావరణం, సెట్ రూపకల్పన వంటి ప్రతి అంశంపై ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతారని వివరించారు.






## 'ఇరుముడి' నుంచి ప్రత్యేక గీతంరానుంది

హైదరాబాద్, జూన్ 4

మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కలయికలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి' నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో కీలక సమాచారం బయటకు వచ్చింది. ఇప్పటికే విడుదలైన ప్రచార దృశ్యం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, తాజాగా చిత్ర బృందం ప్రత్యేక గీతానికి సంబంధించిన ప్రకటన చేసింది.గత కొద్ది రోజులుగా అభిమానుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని, చిత్రంలోని శక్తివంతమైన 'ఇరుముడి' నేపథ్య గీతాన్ని త్వరలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా వెల్లడించారు. 'విల్లాది వీరుడు వీర మణికంఠుడు' అనే పదాలతో సాగే ఈ భక్తి గీతం అయ్యప్ప స్వామి మహిమను ప్రతిబింబించేలా రూపొందించినట్లు సమాచారం.ఇటీవల విడుదలైన ప్రచార దృశ్యాల్లో రవితేజ కొత్త తరహా పాత్రలో కనిపించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. కూతురిపై అపారమైన ప్రేమ కలిగిన తండ్రిగా, జీవితంలో ఎదురైన పరిస్థితుల కారణంగా అయ్యప్ప దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలో పయనించే వ్యక్తిగా ఆయన కనిపించనున్నారు. భావోద్వేగాలు, ఆధ్యాత్మికత, యాక్షన్ అంశాల సమ్మేళనంగా ఈ చిత్ర కథ రూపొందుతున్నట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో రవితేజకు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, బాలనటి నక్షత్ర కీలక పాత్రలో కనిపించనుంది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ స్వరాలు సమకూరుస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న 'ఇరుముడి' చిత్రం వచ్చే ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా, త్వరలో విడుదల కానున్న అయ్యప్ప భక్తి గీతంపై అభిమానుల్లో ఇప్పటికే ఆసక్తి నెలకొంది.



## అర్జున్ ఇంట పెళ్లి సందడి

హైదరాబాద్, జూన్ 4

దక్షిణ భారత సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా కుటుంబంలో త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆయన చిన్న కుమార్తె అంజనా సర్జా ఈ ఏడాది అక్టోబర్ నెలలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.కన్నడ చిత్రసీమలో కథానాయకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన అర్జున్ సర్జా, తెలుగు, తమిళ భాషల్లోనూ అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించారు. ప్రస్తుతం నటుడిగా, నిర్మాతగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఆయన కుటుంబ పరంగా కూడా ఆదర్శ తండ్రిగా ప్రశంసలు అందుకుంటున్నారు.అర్జున్ పెద్ద కుమార్తె ఐశ్వర్య సర్జా సినీ రంగంలో నటిగా కొనసాగుతుండగా, చిన్న కుమార్తె అంజనా సర్జా మాత్రం వ్యాపార రంగాన్ని ఎంచుకున్నారు. అమెరికాలోని ప్రముఖ విద్యాసంస్థలో ఫ్యాషన్ డిజైన్ విద్యను అభ్యసించిన అంజనా, ప్రస్తుతం ఫ్యాషన్ డిజైనర్‌గా, వ్యాపారవేత్తగా మంచి గుర్తింపు పొందారు. ఆమె స్థాపించిన 'సర్జా' సంస్థ పర్యావరణహిత విలాసవంతమైన చేతి సంచుల తయారీలో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. పండ్ల వ్యర్థాలు, యాపిల్, పైనాపిల్, కాక్టస్ వంటి సహజ పదార్థాలతో రూపొందించే ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ లభిస్తోంది.వ్యక్తిగత జీవితానికి వస్తే, అంజనా గత పదమూడు సంవత్సరాలుగా అమెరికాకు చెందిన ఓ యువకుడితో ప్రేమలో ఉన్నట్లు సమాచారం. విదేశాల్లో చదువుకునే సమయంలో ప్రారంభమైన పరిచయం కాలక్రమేణా ప్రేమగా మారిందని తెలుస్తోంది. గత ఏడాది ఇటలీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతంలో కుటుంబ సభ్యుల సమక్షంలో వీరి నిశ్చితార్థం జరిగినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467